సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం ၊ 24 ၊ మే ၊ 2023



వైఎస్ రాజారెడ్డి ఆదర్శప్రాయుడు

పులివెందులలో వైఎస్ రాజారెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. -8లో..



సెల్‌ఫోన్ బంధం.. చేద్దాం దూరం

సెల్‌ఫోన్‌కు బానిసైతే అనేక అనర్థాలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.100	రూ.132
రెండోరకం	రూ.66	రూ.98

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 996 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	233	436
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 635.26 కిలోలు

పురాలకు మహర్దశ

- వైఎస్సార్, అన్నమయ్యజిల్లాల్లోని మున్సిపాలిటీలకు రూ.475.68 కోట్ల నిధులు
- తాగునీటి సరఫరా, అభివృద్ధి, సుందరీకరణకు ప్రాధాన్యత
- దేవుని కడప చెరువు సుందరీకరణకు రూ.68.45 కోట్లు
- కడప నగరానికి రూ.217.2 కోట్లు
- పీహెచ్ఎంఈడీ, ఏపీజీబీసీ ద్వారా పనులు



మదనపల్లె మున్సిపాలిటీ కార్యాలయం

బి.కొత్తకోట: అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల్లోని నగరాలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ప్రజలకు తాగునీటి సరఫరా, పనుల అభివృద్ధి, జగనన్న కాలనీలకు నీటి వసతుల కల్పన, అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులను కేటాయించి పనులకు పాలనాపరమైన అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. పై రెండుజిల్లాల పరిధిలోని మున్సిపాలిటీలకు అవసరమైన నిధులను మంజూరు చేసింది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా, తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ పనుల కోసం రూ.475.68 కోట్లు మంజూరు చేసింది. ఇందులో కొన్ని చెరువుల సుందరీకణ పనులకు అనుమతులు ఇచ్చారు. కేంద్రప్రభుత్వ వాటా నిధులు కలుపుకుని ప్రభుత్వం నిధులు ఇచ్చింది. అమృత్ 2.0, 15వ ఆర్థిక సంఘం నిధులు, స్థానిక మున్సిపాలిటీలకు కొద్దిపాటి వాటాను కలిపి మొత్తం నిధులు కేటాయించారు. ఈ పనులను మున్సిపల్‌శాఖకు చెందిన ప్రజారోగ్య ఇంజనీరింగ్ శాఖ, ఏపీ గ్రీనరీ బోర్డు కార్పొరేషన్ చేపట్టనున్నాయి.

నిధుల్లో కడపకు అగ్రస్థానం

నిధుల కేటాయింపులో కడప నగరానికి అత్యధిక నిధులు కేటాయించారు. నగరానికి చెందిన జగనన్న కాలనీల్లో పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా వారికి నీటి సరఫరా పనులకు ప్రాధాన్యత ఇచ్చారు. హౌసింగ్ కాలనీలో నీటి వసతులకు రూ.37.23 కోట్లు కేటాయించారు. నగరంలో తాగునీటి పథకాల అభివృద్ధి, పైప్‌లైన్ల ఏర్పాటు, ఇతర పనులకు రూ.110.76 కోట్లు, మురికివాడల్లో మురికినీటి వ్యవస్థ కోసం రూ.69.21 కోట్లు కేటాయించారు.

మిగతా మున్సిపాలిటీల్లో..

బి.కొత్తకోట నగర పంచాయతీలో రూ.2.7 కోట్లతో తాగునీటి పనుల అభివృద్ధి, సంపు పైప్‌లైన్ పనులకు కేటాయించారు.

- మదనపల్లె మున్సిపాలిటిలో జగనన్నకాలనీల్లో నీటి సరఫరాకు రూ.5.64 కోట్లు, తాగునీటి సరఫరా పథకాల అభివృద్ధికి రూ.17.65 కోట్లు, మురికినీటి వ్యవస్థ కోసం రూ.6.95 కోట్లు కేటాయించారు.
- రాజంపేటలో తాగునీటికి రూ.30.12 కోట్లు, బద్వేలులో హౌసింగ్ కాలనీలో నీటి వసతులకు రూ.18.8 కోట్లు, నీటి సరఫరా సౌకర్యాల మెరుగుకు రూ.68.46 కోట్లు కేటాయించారు.
- జమ్మలమడుగులో నీటి సరఫరా పథకాల అభివృద్ధికి రూ.10.91 కోట్లు, పులివెందులలో హౌసింగ్ కాలనీకి నీటి వసతులకు రూ.24 లక్షలు, మైదుకూరులో హౌసింగ్ కాలనీకి నీటి సరఫరాకు రూ.3.96 కోట్లు మంజూరు చేశారు.

చెరువుల సుందరీకరణ

రెండు జిల్లాల పరిధిలోని చెరువులను సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా, సౌకర్యాలు కల్పించి అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారు.

- బి.కొత్తకోట పెద్దచెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు, కడప నగరంలోని దేవుని కడప చెరువు అభివృద్ధి, సుందరీకరణ, ఇతర పనులు చేపట్టడం కోసం రూ.68.45 కోట్లు మంజూరు చేశారు. పుట్లంపల్లి చెరువుకు రూ.15 కోట్లు, మైదుకూరులోని శెట్టివారిపల్లె చెరువుకు రూ.2.20 కోట్లు, బద్వేలులోని నాగులచెరువుకు రూ.2.20 కోట్లు, రాయచోటిలోని మాండవ్యనది సుందరీకరణకు రూ.1.60 కోట్లు, చక్రాలమడుగు చెరువుకు రూ.1.60 కోట్లు మంజూరు చేశారు.

టెండర్లకు చర్యలు



పనులు చేపట్టేందుకు వీలుగా ప్రభుత్వం పాలనాపరమైన అనుమతి ఇచ్చింది. ఈ పనులు చేపట్టేందుకు డీటైల్డ్‌ప్రాజెక్టు రిపోర్టులను సిద్ధం చేస్తున్నాం. ఈ పని పూర్తయ్యాక టెండర్లను పిలవనున్నాం. ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు ప్రారంభించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

-ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, ప్రజారోగ్యశాఖ ఎస్ఈ, అనంతపురం

ప్రతి వస్తువు నాణ్యతతో ఉండాలి



విద్యా కానుక బ్యాగుల పరిశీలనపై శిక్షణ ఇస్తున్న డీఈఓ శ్రీరామ్‌పురుషోత్తం

రాయచోటి : జగనన్న విద్యా కానుక ద్వారా మండల స్టాక్ పాయింట్లకు సరఫరా చేస్తున్న ప్రతి వస్తువు కూడా పాఠశాలకు చేరేలోపు నాణ్యత పరిశీలింపబడాలని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్‌పురుషోత్తం సూచించారు. మంగళవారం స్థానిక డైట్ కళాశాలలో జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు, నాడు-నేడు, ఇంజనీర్లు మరియు మండల స్టాక్ పాయింట్ ప్రధానోపాధ్యాయులకు జగనన్న విద్యాకానుకలో ఇచ్చే వస్తువుల నాణ్యతా ప్రమాణాలను ఎలా పరిశీలించాలన్న విషయమై అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పూర్తి నాణ్యతా ప్రమాణాలతో కూడిన వస్తువులను విద్యార్థులకు పంపిణీ చేయాలన్న దృఢ నిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు.

న్యూస్‌రీల్

డ్రిప్ ఇరిగేషన్‌కు దరఖాస్తులు

రాయచోటి టౌన్ : బిందు, తుంపర సేద్యంపై ఆసక్తి ఉన్నవారు రైతు భరోసా కేంద్రాల ద్వారా బయోమెట్రిక్ విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మైక్రో ఇరిగేషన్ అధికారి వెంకటేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు వారి . రైతులు కట్టవల్సిన వాటా సొమ్మును 'జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి, ఏపీఎంఐపీ అన్నమయ్య జిల్లా' పేరున ఫోన్‌పే/ గూగుల్ పే/ఆన్‌లైన్ లేదా డీడీ ద్వారా చెల్లించవచ్చునన్నారు. కాగా, ఆర్‌బీకేలోని సిబ్బంది వారి పరిధిలోని రైతులను గుర్తించి నమోదు చేపట్టాలని సూచించారు.

ఆస్తుల రిజిష్టర్లు అందజేయండి

రాజంపేట టౌన్: దేవాలయాలకు సంబంధించిన ఆస్తుల రిజిష్టర్లను వెంటనే దేవదాయశాఖకు అందచేయాలని ఆ శాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ తెలిపారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం డివిజన్‌లోని అర్చకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్చకుల ఆధీనంలో ఉన్న ఇనాం భూముల వివరాలను కూడా తెలియచేయాలన్నారు. దీప, ధూప, నైవేద్యం కింద మంజూరు కాని ఆలయాల వివరాలను కూడా తెలపాలన్నారు. దేవాలయాల్లో చేపట్టే నిర్మాణ పనులకు అధికారుల అనుమతి తప్పనిసరన్నారు. వెల్ఫేర్ ఫండ్ కింద తీసుకున్న లోన్లను సకాలంలో చెల్లించాలని తెలిపారు. అర్చకులకు ఇంటిస్థలాల మంజూరు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఈఓ కొండారెడ్డి, ఏఈఓ పోలి సుధీష్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఆదర్శ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఏపీ మోడల్ స్కూల్స్ డైరెక్టర్, పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. అభ్యర్థులకు జూన్ 11వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు cse.ap.gov.in/apms.ap.gov.in సందర్శించాలన్నారు.

పథకాలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రీజనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్

కడప రూరల్: ప్రభుత్వం ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్య ఇస్తోందని.. గర్భిణీలు, బాలింతలు, శిశు సంరక్షణ తదితర ఆరోగ్య పథకాలను విజయవంతంగా అమలు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కుమార్ తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ, వారికి అందుతున్న పారితోషకం, సురక్ష యోజన, జనన ప్రణాళిక, రవాణా సౌకర్యాలు తదితర అంశాలపై సమీక్షించారు. పలు సూచనలు చేశారు. ఆరోగ్య పథకాలను అమలు చేయడానికి వైద్య సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ ఖాదర్‌వలి, కొండయ్య, ఆ శాఖ సిబ్బంది ఉమామహేశ్వర్‌కుమార్, లక్ష్మీకర్, మల్లీశ్వరి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతోనే జిల్లా ప్రగతి

కలెక్టర్ గిరీషా పీఎస్



రాయచోటి: అన్నమయ్య జిల్లాలో అభివృద్ధి, సంక్షేమంతోనే జిల్లా ప్రగతి సాధ్యమని కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారుల సమావేశంలో అభిప్రాయపడ్డారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో కలెక్టర్ గిరీషా పీఎస్ స్పందన అర్జీలు, రీ సర్వే, హౌసింగ్, గ్రామ వార్డు సచివాలయాల సమస్యలు, తదితర అంశాలపై ఆయా శాఖ ల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, డీపీఓ ధనలక్ష్మీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్న కుమార్, హౌసింగ్ పీడీ శివయ్య, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ జయరాజ్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న కుంటలు, వాగులు, వంకలకు మరమ్మతులు చేపట్టాలి

అన్నమయ్య జిల్లాలో దెబ్బతిన్న కుంటలు, వాగులు, వంకలకు మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో వర్షాలకు సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వీడియో కాన్ఫరెన్సు ద్వారా అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, ఏఓ బాలకృష్ణ, కో-ఆర్డినేషన్ విభాగపు సూపరింటెండెంట్ శ్రావణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్న కుమార్, హౌసింగ్ పీడీ శివయ్య, డీపీఓ ధనలక్ష్మీ పాల్గొన్నారు.

గ్రామాల ఆదాయం పెరిగే విధంగా చెత్త సేకరణ జరగాలి

గ్రామాల ఆదాయం పెరిగే విధంగా చెత్త సేకరణను చేపట్టాలని కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్వచ్ఛభారత్ మిషన్ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023 జిల్లా, మండల స్థాయి పీర్ కమిటీ సభ్యుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఓ ధనలక్ష్మీ, జడ్పీ డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, రాజంపేట, మదనపల్లె డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బ్యాంకుల వారిగా లక్ష్యాన్ని అధిగమించాలి

జిల్లాలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు బ్యాంకుల వారిగా ఇచ్చిన లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో బ్యాంకర్లతో డీసీసీ డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతుల పంట రుణాలు, గృహ నిర్మాణాలకు అప్రూవల్, రెన్యూవల్, రిజెక్ట్, రుణం పంపిణీ, నూతన లోన్లు తదితర వాటిపై సుదీర్ఘంగా సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు

రాయచోటి : వివిధ మీడియా సంస్థలలో పని చేస్తున్న అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. కలెక్టరేట్ మినీ వీసీ హాల్‌లో మంగళవారం 2023 - 2024 సంవత్సరానికి ప్రభుత్వం జర్నలిస్టులకు అందజేస్తున్న నూతన అక్రిడిటేషన్లు జారీపై జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. 2 సంవత్సరాల కాలపరిమితితో జిల్లాలోని జర్నలిస్టులకు అక్రిడేషన్లు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు, పీరియాడికల్, ఫ్రీలాన్సర్స్, వెటరన్ పాత్రికేయులలో అన్ని నిబంధనలు పూర్తి చేసిన వారికి మొదటి విడతలో 277 మందికి అక్రిడేషన్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వీరికి త్వరలోనే కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో జర్నలిస్ట్ బస్‌పాస్ ఎలిజిబుల్ అయ్యేలా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ కన్వీనర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, డీపీఆర్‌ఓ పురుషోత్తం, పీఆర్‌ఓ ధర్మనాయక్, అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ కీలకం

ఎంపీ మిథున్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



సచివాలయం ప్రారంభిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

సంబేపల్లె : ప్రజలకు మెరుగైన సేవలందించడంలో సచివాలయ వ్యవస్థ చాలా కీలకమైనదని, చారిత్రాత్మకమైనదని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుట్టపల్లె పంచాయతీ అంకిరెడ్డిగారిపల్లెలో ఒకే ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, వైఎస్‌ఆర్ రైతు భరోసా కేంద్రం, వైఎస్‌ఆర్ విలేజ్ క్లినిక్ భవనాలను ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డిలు మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ చిదంబరంరెడ్డిలతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ముందుగా వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

- ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ, వాలంటీర్ వ్యవస్థ ప్రజల ముంగిటకే సేవలు అందిస్తూ భరోసా నిస్తోందన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సచివాలయ వ్యవస్థ ఇతర దేశాలు, రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్ అభివృద్ధి, సంక్షేమ విషయాల్లో ఏ మాత్రం రాజీ పడకుండా రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నారన్నారు. హామీలను 98 శాతం నెరవేర్చారన్నారు.
- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ... గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. రాయచోటి నియోజకవర్గంలో 73 సచివాలయాలకు గాను 60 సచివాలయాలకు భవన నిర్మాణాలు పూర్తి చేశామని, 42 రైతుభరోసా కేంద్రాలు పూర్తి అయ్యాయయన్నారు. 60 విలేజ్ క్లినిక్‌లకు 28 భవన నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు.
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ .... సచివాలయ అధికారులు , సిబ్బంది , వలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. పశు సంవర్ధక శాఖ సేవలు సైతం ఇక్కడ లభిస్తున్నాయన్నారు. రైతుకు ఎన్నో ఉపయోగకరమైన సేవలు గ్రామ సముదాయాలలో అందుతాయన్నారు.
- ఈ కార్యక్రమంలో రాష్ట్ర జానపద, నాట్యకళ, హస్తకళల డైరెక్టర్ నిర్మలాదేవి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, కిషోర్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పాలవెంకట్రమణ, జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డి వెంకట రమణా రెడ్డి పాల్గొన్నారు.

ప్రాజెక్టులు అడ్డుకుని టీడీపీ నాయకుల పైశాచికానందం: ఎంపీ మిథున్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పీలేరు: సాగు, తాగునీటి ప్రాజెక్టులను అడ్డుకుని టీడీపీ నాయకులు పైశాచిక ఆనందం పొందుతున్నారని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఐదవ గ్రామ సచివాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పడమటి ప్రాంతాల్లో భూమిలో నీటి మట్టం వెయ్యి అడుగులకు పడిపోయిందన్నారు. ఈ ప్రాంతంలో పాదయాత్ర చేపట్టిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక పరిస్థితులను ఆకలింపు చేసుకుని సాగు, తాగునీటి సమస్యను శాశ్విత ప్రాతిపదికన పరిష్కరించాలనే ధ్యేయంతో రూ. 5 వేల కోట్లతో గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడానికి పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే తంబళ్లపల్లె నియోజకవర్గంలో ముదివేడులో 2 టీఎంసీల సామర్థ్యంతో ఒక రిజర్వాయర్ పనులు 90 శాతం పూర్తయినట్లు చెప్పారు. పుంగనూరు నియోజకవర్గంలో నేతికుంటపల్లె వద్ద 2 టీఎంసీల సామర్థ్యంతో ఒక రిజర్వాయర్ పనులు 50 శాతం పూర్తయినట్లు తెలిపారు. సదుం మండలంలో 3 టీఎంసీల సామర్థ్యం గల ఆవులపల్లె రిజర్వాయర్ పనులు చురుగ్గా జరుగుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక తెలుగుదేశం పార్టీ నాయకులు 34 మంది కోర్టుకు వెళ్లి ప్రాజెక్టుల నిర్మాణ పనులు ఆపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు అండ్ కో రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాలను కూడా కోర్టుకు వెళ్లి అడ్డుకుందని, కోర్టు మొట్టికాయలు వేయడంతో అమరావతి ప్రాంతంలో 50 వేల మందికి ఇళ్లు ఇవ్వగలుగుతున్నట్లు తెలిపారు. పీలేరు నియోజకవర్గంలో నీటి సమస్య తీరితే పరిశ్రమలు ఏర్పడి ఎంతో మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమీషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ అబీబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రాణం మీదికి తెచ్చిన ఐపీఎల్ బెట్టింగ్

– డబ్బు పోగొట్టుకుని.. ఆత్మహత్యాయత్నం

గుర్రంకొండ : ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ బెట్టింగ్‌లు ఓ యువకుడి ప్రాణం మీదికి తెచ్చాయి. రూ.5.50 లక్షలు పోగొట్టుకొని ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన మండలంలోని తరిగొండ గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆసీఫ్ (23) డ్రైవర్‌గా పని చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మినీ లారీని అద్దెకు ఇవ్వడానికి తీసుకొచ్చాడు. బాగా సంపాదిస్తున్న వేళ ఐపీఎల్ బెట్టింగ్‌లతోపాటు ఆన్‌లైన్ గేమ్‌లైన లూడో వంటి వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో రూ.5.50 లక్షల వరకు వీటిపై పందెలు కాసి పోగొట్టుకొన్నాడు. విషయం తెలుసుకొన్న అతని కుటుంబ సభ్యులు ఇదేం పని అంటూ మందలించారు. దీంతో మనస్తాపం చెంది సోమవారం సాయంత్రం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. జరిగిన సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో చెరువులో పడి..

బి.కొత్తకోట : మద్యం మత్తులో ఓ వ్యక్తి చెరువులో పడ్డాడు. ఇది గమనించిన స్థానిక విలేకరులు చెరువులో మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. తీరా అతన్ని చెరువులోంచి బయటకు తీయగా బతికే ఉన్నాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బడికాయలపల్లెకు చెందిన కృష్ణప్ప అనే వ్యక్తి మంగళవారం అతిగా మద్యం సేవించాడు. ఎక్కడికి పోతున్నాడో తెలియని స్థితిలో ఉన్న అతను స్థానిక పెద్దచెరువులో పడిపోయి తేలియాడుతున్నాడు. దూరం నుంచి గమనించిన కొందరు విలేకరులు మృతదేహమని అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెడ్‌కానిస్టేబుల్ నాగరాజుగౌడ్, సిబ్బంది, విలేకరులు కలిసి.. ఒడ్డుకు తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అంతలో కృష్ణప్ప శ్వాస తీసుకుంటుండటంతో చనిపోలేదని నిర్ధారించి చెరువులోంచి బయటకు తీసుకొచ్చారు. మద్యం మత్తు నుంచి కొంతసేపటికి తేరుకున్న కృష్ణప్ప నడుచుకొంటూ వెళ్లిపోయాడు. కృష్ణప్ప చెరువులో పడివుండటం గమనించకుండా ఉంటే.. జరగాల్సిన నష్టం జరిగేది.

సిమెంటు లారీలు ఢీకొని..



బోల్తా పడిన సిమెంటు లారీ

రామాపురం : కర్నూలు – చిత్తూరు 40 జాతీయ రహదారి మార్గంలోని రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ ఆదర్శ పాఠశాల సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ఆగి ఉన్న సిమెంటు లారీని మరో సిమెంటు లారీ ఢీకొంది. ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రగుంట్ల నుంచి సిమెంటు లోడుతో దేవపట్లకు వెళ్తుండగా రామాపురం మండలం ఆదర్శ పాఠశాల సమీపంలో ఆగి ఉన్న మరో సిమెంటు లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో నిలిచి ఉన్న లారీ బోల్తా పడి దెబ్బతినింది. సమాచారం తెలుసుకొన్న మండల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సిమెంటు బస్తాలను దొంగలించినట్లు డ్రైవర్ చంద్రశేఖర్ పోలీసులకు తెలియజేశాడు. రెండు లారీల్లోని డ్రైవర్, క్లీనర్‌లకు ఎలాంటి గాయాలు కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సెల్‌ఫోన్ బంధం.. చేద్దాం దూరం

- మదనపల్లె పట్టణం నక్కలదిన్నెకు చెందిన ఓ విద్యార్థిని సెల్‌ఫోన్ చేతిలో లేకుంటే.. ఒక్క క్షణం ఉండలేని పరిస్థితి. మానసిక ఆందోళనలు ఎక్కువయ్యాయి. ఈ ప్రభావం చదువుపై పడి కొన్ని పరీక్షల్లో ఫెయిల్ అయింది. దీంతో ఫోన్ అలవాటు తగ్గేలా చూడాలంటూ తల్లిదండ్రులు మానసిక నిపుణులను ఆశ్రయించారు. పరీక్షించిన వైద్యులు కౌన్సెలింగ్‌తోపాటు పూర్వస్థితికి తేవడానికి చికిత్సలు అందిస్తున్నారు.
- మదనపల్లె మండలం బసినికొండకు చెందిన ఓ విద్యార్థి సెల్‌ఫోన్‌కు బానిసయ్యాడు రాత్రి వేళల్లో సరిగ్గా నిద్రించడం మానేశాడు. ఈ క్రమంలో చదువుపై శ్రద్ధ తగ్గింది. తల్లిదండ్రులు మంచి చెబితే వారిని కసురుకోవడం, ఫోన్ ఇవ్వకపోతే అసభ్య పదజాలంతో దూషణలు ఎక్కువయ్యాయి. ఎంత చెప్పినా మార్పు రాకపోవడంతో మానసిక వైద్యుడిని సంప్రదించి కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు.

ఇలాంటి పరిస్థితి వీరిద్దరిది మాత్రమే కాదు. ఎంతో మంది ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సెల్‌ఫోన్‌కు బానిసైతే జరిగే దుష్పరిణామాలపై అందిస్తున్న ప్రత్యేక కథనం.



- గంటల కొద్దీ గడిపేస్తున్న చిన్నారులు, యువత
- సెలవుల్లో ప్రత్యామ్నాయాలే మేలు

మదనపల్లె సిటీ : సమయం ఎంతయిందో చూడాలన్నా.. టార్చ్ వేయాలన్నా.. ఎవరికైనా సందేశం పంపాలన్నా.. విజ్ఞానం, వినోదం, ఆరోగ్యం, క్రీడలు ఇలా ఒకటేమిటి.. ఎన్నో విషయాల కోసం సెల్‌ఫోన్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి. చిన్నా, పెద్దా తేడా లేకుండా గంటల తరబడి అతుక్కుపోతున్నారు. అతిగా చూడటం వల్ల కంట్లో తడి ఆరిపోయి.. భారం పడి నేత్ర సమస్యలు తలెత్తుతున్నాయి. పడుకుని గంటల తరబడి చూడటంతో మెడ, చేతిపై భారం వల్ల నరాలు, కండరాల సమస్యలు వస్తున్నాయి. నిద్రలేమితో మానసిక సమస్యలూ ఎదురవుతాయి. ప్రస్తుతం వేసవి సెలవులు. పిల్లలంతా తల్లిదండ్రుల చుట్టూనే ఉంటారు. వారి అల్లరి కట్టడి చేయడం కొందరికి కష్టమే. అందుకే చేతికి ఫోన్ ఇచ్చేస్తే ఓ మూలన కూర్చుంటారనే భావన ఎక్కువ మందిలో కనిపిస్తోంది. ఇదే అనర్థాలకు కారణమవుతోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సమస్యల సుడిలో...

కోవిడ్ విజృంభణ తర్వాత చదువులు, ఉద్యోగాలు ఇళ్ల నుంచే కొన్నాళ్లు సాగాయి. సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు, కంప్యూటర్ల వినియోగం గణనీయంగా పెరిగింది. సెల్‌ఫోన్లు వాడే పిల్లలనూ సైతం నియంత్రించలేని పరిస్థితి. ఆన్‌లైన్ గేమ్‌లకు కొందరు బానిసలై మానసికంగా కుంగిపోతే, అశ్లీల దృశ్యాలు చూస్తూ ఇంకొందరు గతి తప్పే పరిస్థితి నెలకొంది. చాటింగ్‌లతో మరికొందరు వివాదాల్లోకి వెళ్లే సందర్భాలు నెలకొంటున్నాయి.

పరిమిత సమయమే మేలు

పిల్లల అల్లరి భరించలేక వారి చేతికి తల్లిదండ్రులు సెల్‌ఫోన్లు ఇస్తున్నారు. ఇది శ్రేయస్కరం కాదని వైద్యనిపుణులు చెబుతున్నారు. వారితో సరదాగా ఆటపాటలతో గడపాలని, జ్ఞానాన్ని పెంచే సంగతులు చెప్పాలని సూచిస్తున్నారు. ఫోన్ వారి చేతికి ఇవ్వాల్సి వస్తే చదువులకే పరిమితం చేయాలి. విజ్ఞానం వెసులుబాటు కల్పించడం ఉత్తమమని చెబుతున్నారు. యువత ఆన్‌లైన్ క్రీడలు ఆడడానికో.. అశ్లీల దృశ్యాలు చూడటానికో.. గంటల తరబడి చాటింగ్‌కో అలవాటు పడుతున్నారు. ఇలాంటి కదలికలపై తల్లిదండ్రులే దృష్టి సారించాలి. పుస్తకాలు చదవటం, ఆటలు, వ్యాయామం, యోగా, మానసిక ఉల్లాసం కలిగించే అంశాలపై దృష్టి మరల్చాలి.

ఏకాగ్రతకు దెబ్బ



ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో పిల్లలు చదువుల్లో రాణించాలంటే ఏకాగ్రత చాలా అవసరం. సెల్‌ఫోన్ ఎక్కువ వినియోగిస్తే ముందుగా దెబ్బతినేది ఏకాగ్రతే. ఫోన్‌లకు ఎక్కువ అలవాటు పడితే సమయానికి నిద్రపోరు. మెదడు చురుగ్గా పని చేయదు. అదే పనిగా స్క్రీన్ చూస్తుండటం వల్ల దృష్టిలోపం, తలనొప్పి వస్తాయి. ఎక్కువ సేపు శారీరక శ్రమలేకుండా వాటికే అతుక్కుపోవడం వల్ల ఊబకాయం బారిన కూడా పడే ప్రమాదం ఉంది. వేసవిలో పిల్లలు సెల్‌ఫోన్లు, టీవీలకు పరిమితం కాకుండా తల్లిదండ్రులే చూసుకోవాలి. వేసవి శిక్షణా శిబిరాలకు పంపించినా ప్రయోజనం ఉంటుంది.

– డాక్టర్ ఎం.ఎస్.పావని, మెడికల్ ఆఫీసర్, సీహెచ్‌సీ, తంబళ్లపల్లె

తల్లిదండ్రులదే బాధ్యత



పిల్లలకు సెలవులు వచ్చాయంటే వచ్చే ఏడాదికి ఈ సమయం పునాది కావాలన్న ఆలోచన తల్లిదండ్రులకు ఉంటుంది. ఏడాదంతా కష్టపడ్డాం .. ఇప్పుడు సరదాగా గడిపేద్దామనే ఆలోచన పిల్లల్లో ఉంటుంది. ఈ పరిస్థితులను సమన్వయం చేసుకుని పిల్లలను చక్కదిద్దుకునే బాధ్యత తల్లిదండ్రులు స్వీకరించాలి. సెలవుల్లో బలహీనతలను పోగొట్టి నైపుణ్యాలను పెంచాలి. సెల్‌ఫోన్ ముట్టుకోవడానికి వీల్లేదని ఆంక్షలు విధిస్తే ఎలాగైనా చూడాలని పిల్లలు తపన పడే ప్రమాదం ఉంది. అందుకే స్నేహపూర్వకంగా మెలిగి ఫోన్ ఇచ్చిన కొద్ది సేపయినా విజ్ఞానం పంచే అంశాలు చూసేలా పర్యవేక్షించాలి. సంగీతం, చదరంగం, నృత్యం వంటివి సాధన చేస్తే జీవితంలోనూ రాణించే వీలుంటుంది.

– చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె.

తేనెటీగల దాడిలో నలుగురికి గాయాలు

మదనపల్లె : తేనెటీగల దాడిలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రామసముద్రం మండలంలో జరిగింది. రామసముద్రంకు చెందిన విశ్వనాథ(38), బోయకొండప్ప(22), రాధ(20), అఖిల(16) కలిసి మామిడికాయలు కోసేందుకు చెంబకూరు సమీపంలో మామిడి తోటల్లో కూలికి వెళ్లారు. కాయలు కోస్తుండగా తోటలోని తేనెటీగలు ఒక్కసారిగా వీరిపై దాడి చేశాయి. నలుగురూ గాయపడగా స్థానికులు ఆటోలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల చికిత్స అనంతరం కోలుకుంటున్నారు.

వ్యక్తిపై దాడి



గాయపడ్డ శంకర

మదనపల్లె : అమ్మాయిని వేధిస్తుండటంతో మందలించినందుకు ఓ వ్యక్తిపై మూకుమ్మడిగా కొందరు కర్రలతో దాడి చేసిన సంఘటన చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో జరిగింది. బరినేపల్లెకు చెందిన పి.శంకర(37) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన సోదరి కొంతకాలం క్రితం మృతి చెందడంతో ఆమె కుమార్తె భారతిని తన వద్దే ఉంచుకుని చదివిస్తున్నాడు. అయితే అదే గ్రామానికి చెందిన మురుగేష్ కొద్ది రోజులుగా భారతి వెంటపడుతూ ప్రేమిస్తున్నానని వేధిస్తున్నాడు. మురుగేష్‌ను పలుమార్లు శంకర మందలించి, అతడి తల్లిదండ్రులకు సైతం చెప్పినా పద్ధతి మార్చుకోలేదు. యథావిధిగా మంగళవారం మురుగేష్.. భారతిని వేధించడంతో శంకర అతడిపై చేయి చేసుకున్నాడు. దీంతో ఆవేశానికి గురైన మురుగేష్, అతడి కుటుంబ సభ్యులు శంకరపై మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధిత కుటుంబీకులు శంకరను 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారాన్ని అవుట్‌పోస్ట్ సిబ్బంది పుంగనూరు పోలీసులకు తెలిపారు.

దోపిడీ దొంగల కోసం పోలీసుల వేట

కడప కోటిరెడ్డిసర్కిల్ : కమలాపురం సమీపంలో ఇటీవల జరిగిన రైలు దోపిడీ ఘటనపై పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తూ, దొంగల కోసం వేట కొనసాగిస్తున్నారు. గతంలో ప్రొద్దుటూరు, ఆదోని ప్రాంతాల్లో జరిగిన రైలు దోపిడీల్లాగానే కమలాపురం వద్ద జరిగిన దోపిడీ కూడా అలాంటిదేనని భావిస్తున్నారు. మహారాష్ట్రలోని షోలాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన ముఠా సభ్యులు దోపిడీకి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ తరహా రైలు దోపిడీకి పాల్పడేది ఎక్కువగా ఇతర రాష్ట్రాల వారేనని వారు అంచనా వేస్తున్నారు. త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని పోలీసు అధికారులు చెబుతున్నారు.

ఎరువుల దుకాణం సీజ్



విక్రయదారుడి వద్ద వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ డివిజనల్ అధికారి రమేష్‌బాబు

రాజంపేట రూరల్ : సిద్దార్థ ఆర్గానిక్ అగ్రి ప్రొడక్ట్ పేరుతో అనుమతులు లేకుండా ఎరువులు విక్రయిస్తున్న దుకాణాన్ని సీజ్ చేసినట్లు వ్యవసాయ శాఖ డివిజనల్ అధికారి జి.రమేష్‌బాబు తెలియజేశారు. ఆయన మండల వ్యవసాయ శాఖ అధికారిణి జి.రాజకుమారితో కలిసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. స్థానిక రైల్వేకోడూరు దారిలో ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ సమీపంలో ఓ అద్దె భవనంలో ఎటువంటి బోర్డు లేకుండా గజేంద్రరెడ్డి విక్రయిస్తున్న సేంద్రియ ఎరువులను గుర్తించారు. రూ.97 వేల విలువైన సేంద్రియ ఎరువులు, అలాగే దుకాణాన్ని సీజ్ చేశారు. నందలూరు మండలానికి చెందిన రైతు సుధీర్‌కుమార్ తమకు ఫిర్యాదు చేసినట్లు వ్యవసాయ డివిజనల్ అధికారి జి.రమేష్‌బాబు తెలియజేశారు. ఈ తనిఖీలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నాలుగు వాహనాలు ఢీ

– ఇద్దరికి గాయాలు



దెబ్బతిన్న వాహనాలు

పుల్లంపేట : మండల పరిధిలోని రెడ్డిపల్లి చెరువుకట్ట వద్ద మంగళవారం తెల్లవారుజామున నాలుగు కార్లు ఢీకొన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. తెలంగాణకు చెందిన సిద్దిపేట, వికారాబాద్, వనపర్తి నుంచి మూడు వాహనాలలో తిరుమలకు వెళ్తున్నారు. తిరుపతి నుంచి రాజంపేటకు వస్తున్న కారు రెడ్డిపల్లి చెరువుకట్ట సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న మూడు వాహనాలను ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు గాయాల పాలయ్యారు. వీరిని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం వల్ల వాహనాలు దెబ్బతిన్నాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రఘురాం తెలిపారు.

కూతురితో పాటు బావిలో దూకిన తల్లి

– ఇద్దరూ మృతి

గోపవరం : పాపం ఆ తల్లికి ఏమి కష్టం వచ్చిందో ఏమో తెలియదు కాని నవమాసాలు మోసి కనిపెంచిన కన్నబిడ్డను బావిలో తోసేసి తాను బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. వైఎస్సార్ జిల్లా గోపవరం మండలంలోని చెన్నవరం దళితవాడలో మంగళవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. మనేపల్లె ఓబయ్య, ఓబులమ్మ దంపతుల కుమార్తె మంజుల (30)ను పది సంవత్సరాల క్రితం నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం మంచాలపల్లె గ్రామానికి చెందిన మేనమామ చిరంజీవికి ఇచ్చి వివాహం చేశారు. వీరి దాంపత్య జీవితం సజావుగా సాగింది. వీరికి 7 సంవత్సరాల బాబు, 5 సంవత్సరాలు, సంవత్సరంలోపు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ నేపథ్యంలో మంజుల 20 రోజుల క్రితం భర్తతో కలిసి పుట్టింటికి వచ్చింది. కుటుంబ సభ్యులందరితో కలిసి బాగానే ఉండేవారు. ఇంతలో ఏం జరిగిందో తెలియదు కానీ, మంగళవారం తన రెండో కుమార్తె రాజేశ్వరి (5)ని తీసుకుని దళితవాడకు సమీపంలో ఉన్న బావిలో దూకింది. తల్లికూతురు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల విచారించగా కొద్దిసేపటి క్రితమే బిడ్డను తీసుకుని చెరువు వైపు వెళుతున్నట్లు చూసిన వారు చెప్పడంతో కుటుంబ సభ్యులు, దళితవాడ ప్రజలు చెరువు వద్దకు పరుగులు తీయగా అక్కడే బావి గడ్డపై మంజుల చెప్పులు ఉండటంతో బావిలో దూకినట్లు నిర్ధారించుకున్నారు. స్థానికులు బావిలో దూకి గాలించగా పాప మృతదేహం లభించింది. తల్లి కోసం గాలించగా ఎంతసేపటికి ఆచూకీ లభించకపోవడంతో బద్వేలు రూరల్ పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. ఫైర్ సిబ్బంది బావిలో గాలించి మంజుల మృతదేహం కూడా వెలికి తీశారు. పాలు తాగే చంటిబిడ్డను ఇంటిలో వదిలేసి మరో బిడ్డను తీసుకుని తల్లి బావిలో దూకి చనిపోవడం అటు కుటుంబ సభ్యులను, ఇటు గ్రామస్తులను కలిచివేసింది. చంటిబిడ్డ ఆక్రందనను చూసి అందరూ కంటతడి పెట్టారు. భర్త కూలీ పని చేసుకుంటూ భార్య, పిల్లలను పోషించుకునేవాడు. బద్వేలు రూరల్ ఎస్‌ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

పులివెందుల రూరల్ : పులివెందులలో డబ్బుల విషయమై ఘర్షణ జరగడంతో.. ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ హుస్సేన్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నగరిగుట్ట ఎస్సీ కాలనీకి చెందిన రత్నాకర్ అలియాస్ గుల్లో నగరిగుట్టలోనే నివసిస్తున్న వినోద్‌కు రూ.30 వేలు ఇవ్వాల్సి ఉంది. ఆ డబ్బులు ఇవ్వాలని వినోద్.. రత్నాకర్ ఇంటికి వెళ్లి అడిగాడు. అక్కడ రత్నాకర్, వినోద్ మధ్య వాగ్వాదం జరిగింది. ఇరువురు ఘర్షణ పడ్డారు. అదే సమయంలో ఇంటిలో ఉన్న రత్నాకర్ మిత్రుడు మణి వేట కొడవలితో వినోద్ భుజంపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇదే ఘటనలో మణికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న వినోద్ బంధువులు రత్నాకర్ ఇంటిపై దాడి చేసి సామాన్లు ధ్వంసం చేశారు. అలాగే నాలుగు బైకులను ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. ఇరు వర్గాల వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో సర్పంచ్ మృతి



బాబురెడ్డి (ఫైల్)

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రంగసముద్రం గ్రామ పంచాయతీ సర్పంచ్ కొండా జగదీశ్వర్‌రెడ్డి అలియాస్ బాబురెడ్డి (54) మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్వగ్రామమైన కుర్రావాండ్లపల్లిలోని ఇంటి ఎదుట నీటి సంపు మోటారు ఆన్ చేస్తుండగా షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ పంచాయతీలో అందరి మన్ననలు పొందిన బాబురెడ్డి గతంలో రెండు సార్లు సర్పంచ్‌గా ఎన్నిక కాగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా గత నెల 14న సంపతికోట పంచాయతీ కానుగమాకులపల్లిలో జరిగిన గృహ ప్రవేశంలో షామియానా గాలికి లేచి పైనున్న విద్యుత్ తీగలు పడటంతో నలుగురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఇదే శుభ కార్యానికి హాజరైన బాబురెడ్డి ఘటనా స్థలంలోనే విద్యుత్ షాక్ బారి నుంచి ఆరుగురిని కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. అయినా కూడా ఆయన అర్ధాంతరంగా విద్యుత్ షాక్‌తో మృతి చెందడాన్ని గ్రామ పంచాయతీ ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. విషయం తెలుసుకున్న తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఫోన్‌లో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓ మంచి నాయకుడిని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు పార్టీలకతీతంగా నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. ఎస్‌ఐ రవీంద్రబాబు కేసు నమోదు చేశారు.

చేపల కోసం వెళ్లి.. చెరువులో మునిగి..

తల్లీకూతుళ్లకు అస్వస్థత





చికిత్స పొందుతున్న రమణమ్మ, లక్ష్మీప్రసన్న

మదనపల్లె : చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో నీట మునిగి తల్లీకూతుళ్లు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని దిగువ కురవంకకు చెందిన రమణయ్య భార్య రమణమ్మ (45) కుమార్తె లక్ష్మీప్రసన్న (18)తో కలిసి స్థానిక బైపాస్ రోడ్డులో ఉన్న రెడ్లచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. చెరువులోకి దిగి చేపలు పట్టే ప్రయత్నంలో ఇద్దరూ బురదలో ఇరుక్కుని నీట మునిగారు. మునుగుతున్న సమయంలో బిగ్గరగా కేకలు వేయడంతో స్థానికులు గుర్తించి వారిని బయటకు తీశారు. కాగా ప్రమాదంలో ఊపిరి ఆడక నీళ్లు మింగేయడంతో వారు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులను 108 వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు ఐసీయూలో ఉంచి బాధితులకు చికిత్సలు అందించగా కోలుకుంటున్నారు. కొంత ఆలస్యమై ఉంటే ప్రాణ నష్టం జరిగి ఉండేదని డాక్టర్లు తెలిపారు. బాధితురాలు రమణమ్మ తేరుకుని మాట్లాడటంతో ప్రమాద వివరాలు తెలిశాయి. ఈ మేరకు తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

పులివెందుల రూరల్ : ప్రమాదవశాత్తు కాలువ నీటిలో పడి ఓ వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కమలాపురం మండలం పెద్దచెప్పలికి చెందిన మల్లయ్య (45) పదేళ్ల క్రితం జీవనోపాధి కోసం పులివెందుల వచ్చాడు. అక్కడ ప్రశాంతి నగర్‌లో నివాసముండేవాడు. కోళ్లకు సంబంధించిన వ్యాన్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ పని చేసే వాడు. మంగళవారం కూడా అదే విధంగా అన్‌లోడింగ్ చేసి తిరిగి పులివెందులకు వస్తుండగా.. మార్గంమధ్యలో రాణితోపు వెనుకవైపు ఉన్న లింగాల కుడికాలువలో కాళ్లు కడుక్కునేందుకు దిగాడు. ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడిపోయాడు. అతన్ని రక్షించేందుకు మరో వ్యక్తి ప్రయత్నం చేశాడు. కానీ అంతలోనే మల్లయ్య మునిగిపోయాడు. అటువైపు వెళుతున్న మరో వ్యక్తి కాలువలోకి దిగి మల్లయ్యను బయటకు తీశాడు. అయితే అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య రాజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హుస్సేన్ తెలిపారు.

వైఎస్ రాజారెడ్డి ఆదర్శప్రాయుడు



వైఎస్ రాజారెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతమ్మ, వైఎస్ సుధీకర్‌రెడ్డి తదితరులు

పులివెందుల : వైఎస్ రాజారెడ్డి ఆదర్శప్రాయుడని దివంగత సీఎం వైఎస్సార్ సతీమణి, పులివెందుల మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ.. దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, వైఎస్ రాజారెడ్డి తనయుడు వైఎస్ సుధీకర్‌రెడ్డి పేర్కొన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి వైఎస్ రాజారెడ్డి 25వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. పులివెందులలోని డిగ్రీ కళాశాల రోడ్డులో గల వైఎస్సార్ సమాధుల తోటలో దివంగత వైఎస్ రాజారెడ్డి, వైఎస్ జయమ్మల సమాధుల వద్ద వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతమ్మ, వైఎస్ సుధీకర్‌రెడ్డిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ పాస్టర్లు ఆనందబాబు, నరేష్‌కుమార్, మృత్యుంజయలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అక్కడే ఉన్న దివంగత వైఎస్ జార్జిరెడ్డి, దివంగత వైఎస్ వివేకానందరెడ్డి, దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డిల సమాధులతో పాటు ఇతర బంధువుల సమాధుల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్ రాజారెడ్డి సమాజానికి చేసిన సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, వేంపల్లె మాజీ జెడ్పీటీసీ డాక్టర్ ఎస్.ఎఫ్.బాషా, అంబకపల్లె నారాయణస్వామి, వెంగమునిరెడ్డి, పార్నపల్లె నాయుడులతో పాటు వైఎస్సార్ కుటుంబ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.